www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 05 | నవంబర్ | 2025 పేజీలు : 8


## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



-పత్తి కొనుగోలులో ఆంక్షలు ఎత్తివేయాలి
-లక్షలాది మందితో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి
-సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం

2లో..

# అసలు సరే.. కొసరు సంగతేంటి..?





-శృతిమించిన అధికార పార్టీ క్యాడర్ తీరు
-అధికారులకు తప్పని తిప్పలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** అసలు కం కొసరు పైనే మక్కువ అన్నది నానుడి. ఇప్పుడు అసలును మించి కొసరు వ్యవహారిస్తున్న తీరు అధికార పార్టీకి ఇబ్బందులు తెచ్చిపెడుతుంది. మంత్రులు, శాసన సభ్యులు, ఇతరత్రా బాధ్యతల్లో ఉన్న వారు ఫర్వాలే దనిపించినా మండల స్థాయి నాయకులు గ్రామాలలో అధికార పార్టీ పేరుతో పెత్తనం చెలాయించే వారి తీరు శృతి మించుతుంది. మంత్రులు శాసన సభ్యుల అనుచరులుగా తమ ప్రాబల్య ప్రాంతాలలో దందాను నడిపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక బాధ్యతను స్థానిక నాయకత్వానికి అప్పగించిన తర్వాత వారిలో మరింత మార్పు వచ్చింది. ఇక మనం చెప్పిందే నడుస్తుంది నడవాలి అనే తత్వం బలపడింది. గ్రామాల్లో ఆధిపత్యాన్ని ప్రదర్శించడంతో పాటు అక్రమ సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. గతంలో నాయకులు తమ అనుచరులకు ఏమైనా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు ఉంటే వెంట పెట్టుకుని వచ్చి పని చేయించే వారు. ఇప్పుడు చాలా చోట్ల అధికార పార్టీ నేతలు తమ కార్యకర్తల వద్దే పనికో రేటు కట్టి వసూలు చేస్తున్నారు. అమాత్యుల మాటలను, హెచ్చరికలను కూడా లెక్కచేయడం లేదు. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రి కాంగ్రెస్ నాయకులతో ప్రత్యేకంగా సమావేశం పెట్టి అర్హత కలిగిన వారికి ఇండ్లు ఇవ్వండి. రాజకీయాలు చూడకుండా అతి పేదలకు తొలి ప్రాధాన్యతనివ్వండి అని గ్రామాల వారీగా బాధ్యులను ఎంపిక చేస్తే చివరకు తమ అనుచరులకు ఇప్పించి వారి వద్ద నుంచి కొంత పుచ్చుకునేందుకు ప్రయత్నం చేశారు తప్ప ఆ అమాత్యుని మాట అసలు పరిగణలోకే తీసుకోలేదు.

మిగతా 2లో..

## వార్తలు రాస్తే చేతులు నరికేస్తా



-ఇక రంగంలోకి దిగా రణరంగమే
-ఓ ఊసరవెల్లి ఉడత ఊపులు

**ప్రజాపక్షం/ఖమ్మం :** నాకు సంబంధించి ఏమైనా వార్తలు రాస్తే ఎవరిని వదలను. ఒక్కొక్కడిని కాళ్లు, చేతులు విరగొట్టిస్తా. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతకాలి ఇక్కడ ఓ ఊసరవెల్లి కోతలు ఇవి. ఏమి లేనివాడు ఎగిరెగిరి పడినట్లు ఏమి చేతకాక తప్పుడు వ్యాపారాలు మానుకోలేక ఓ ఊసరవెల్లి నలుగురు కూడిన చోట నోరు పారేసుకుంటుంది. పార్టీలు మార్చడంలో అగ్రభాగాన నిలిచే ఈ ప్రబుద్ధుడు ఖమ్మం రూరల్ మండలంలో ఓ వెంచర్ వేశాడు. డిటిసిపి నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ వేయడంతో పాటు నాగార్జున సాగర్ కాలువను సైతం ఆక్రమించుకున్నాడు. అలాగే ఓ ఆరు కుంటల భూమిని సైతం ఆక్రమించి వెంచర్‌లో కలిపేసుకున్నాడు. ఈ కాలువ క్రింద సుమారు 80 ఎకరాలు సాగవుతుంది. సదరు ప్రబుద్ధుడు ఓ చెరువు శిఖం భూమిని సైతం ఆక్రమణ చేసుకోవడంతో దానిపై ఇప్పటికీ అధికారులను మచ్చిక చేసుకునేందుకు తిరుగుతూనే ఉన్నాడు. ఇప్పుడు తాజాగా అక్రమ వెంచర్ విషయంలోనూ సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. అయినా అధికారులు నోరు మెదపడం లేదు. ఈ నేపథ్యంలో తన వెంచర్ అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు అధికార పార్టీలో చేరాడు. ఇక అప్పటి నుంచి చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్నట్లు నా తండ్రి అంత , నేను ఇంత అన్నట్లుగా వ్యవహరిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం ఈ అక్రమ వెంచర్ గురించి వార్తలు ప్రచురితమయ్యాయి. వెంటనే అధికార పార్టీ నాయకున్ని కలిసి ఈ వార్తలు రాకుండా కట్టడి చేయాలని కోరాడు. దీనిపై సదరు అధికార పార్టీ నాయకుడు నీ వెంచర్‌కు అన్ని అనుమతులు ఉన్నాయా అని అడిగాడు సదరు అక్రమ వెంచర్ నిర్వాహకుడు సక్రమమే అని తెలపడంతో ఎవరు ఎన్ని వార్తలు రాసిన నీకు ఏమి కాదని బదులిచ్చాడు. ఈ నేపథ్యంలో అక్కడి నుంచి చేసేది ఏమి లేక వెనుదిరిగి వచ్చి నలుగురు కూడిన చోట నోరు పారేసుకోవడం మొదలుపెట్టాడు. నోటికి ఏది వస్తే అది మాట్లాడటం పనిలో పనిగా ఏమి సాయం చేయలేదని అధికార పార్టీ నాయకులను సైతం విమర్శిస్తుండటం అతనికే చెల్లింది. ఇక ఈ వెంచర్‌పై వార్తలు ప్రచురిస్తున్న విలేకరుల కాళ్లు చేతులు నరికేస్తా, విరగొడతా అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. తన ఉడత ఊపులకు ఎవరు భయపడరని తెలిసినా ఆయన

మిగతా 2లో..

## బకాయిల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు





-విద్యార్థుల పట్ల ప్రభుత్వం వివక్ష
-ప్రభుత్వ విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలి
-ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వం విద్యార్థుల బోధన రుసుములు, ఉపకార వేతనాలను తక్షణమే మంజూరు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం

మిగతా 2లో..

# అసలు సరే.. కొసరు సంగతేంటి..?

(మొదటిపేజీ తరువాయి)
రాజకీయాలకు తావివ్వద్దు, మనకు సహకరించిన వారికి ప్రాధాన్యత నివ్వండి అని చెప్పిన అది ఎక్కడ అమలైన దాఖలాలు లేవు. మండల ఆ దిగువ స్థాయి నాయకులు ఇటీవల కాలంలో అధికార యంత్రాంగం పైన పెత్తనం చేసే పరిస్థితి ఏర్పడింది. ప్రతి దానిలోనూ తమ మాటే నెగ్గాలన్న ఆలోచనతో అధికారులపై ఒత్తిడి తీసుకు వస్తున్నారు. ఏ అధికారి అయినా తాము చెప్పింది చేయకపోతే ఆరోపణలు చేయడం, శాసనసభ్యులకు, మంత్రులకు అధికారులపై ఫిర్యాదులు చేసి తమ దారిలోకి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, విద్యుత్ శాఖాధికారులపై తమ అధికార పెత్తనాన్ని కొనసాగించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. న్యాయ, అన్యాయాలు, వాస్తవ పరిస్థితుల గురించి అధికార యంత్రాంగాన్ని ఆలోచించనివ్వడం లేదు. తాము చెప్పిందే చేయాలంటూ కొందరైతే ప్రభుత్వ కార్యాలయాల్లో కూర్చుని హుకుం జారీ చేస్తున్నారు. దీనితో బాధితులే నేరస్తులుగా అభియోగాలను ఎదుర్కొవాల్సి వస్తుంది. అధికార పార్టీకి చెందిన కొందరి తీరు ప్రజాప్రతినిధులకు, అధికార పార్టీకి కూడా మచ్చ తెచ్చేవిధంగా కొన్ని ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇటువంటి వాటిని కట్టడి చేయడంతో పాటు అధికారులు సరైన నిర్ణయం తీసుకునే అవకాశాన్ని, స్వేచ్ఛను కల్పించాలి. ఖమ్మం జిల్లా కేంద్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధి ఒకరు ద్వితీయ శ్రేణి నాయకత్వ వికృత, వింత పోకడలు, అక్రమ దందాలపై దృష్టి సారించి పూర్తి నియంత్రణలోకి తెచ్చుకోవడంలో సఫలీకృతులయ్యారు. మిగిలిన నియోజక వర్గాల్లోనూ స్వార్థంతో కూడిన వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించి పార్టీలు మారుతూ రాజకీయం చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. వీరి వ్యవహార శైలి అధికారులను తప్పుదారి పట్టించే వైఖరి కారణంగానే గతంలో పలువురు ప్రజాప్రతినిధులకు మరకలు అంటుకున్నాయి. ప్రభుత్వాలపైన హేయభావం ఏర్పడుతుంది. శృతిమించిన ద్వితీయ శ్రేణి నాయకత్వ పోకడలు చివరకు ఓటమిని మూటకట్టుకునేలా చేసిన వాస్తవ ఘటనలు కళ్లేదుటే ఉన్నాయి. ఇక కొందరైతే అధికారిక హోదాలలో అధికారులతో సమీక్షలు నిర్వహించడం, హుకుం జారీ చేయడం అధికారిక కార్యక్రమాల్లో వేదికలు ఎక్కి ఉపన్యాసాలు ఇవ్వడం కూడా చర్చనీయాంశలవుతున్నాయి. అక్రమ సంపాదనలు, సెటిల్‌మెంట్ల కొరకు పార్టీలను, ప్రజాప్రతినిధులను వినియోగించుకునే వారిపై ఓ కన్నెసి ఉంచాలి. ఏదైనా శృతిమించితే అందుకు ప్రతిఫలం అనుభవించాల్సింది ప్రభుత్వం, ప్రజాప్రతినిధులే. ఇప్పటికైనా అసలు నాయకత్వం తాము మంచిగానే ఉన్నామనుకుంటే సరిపోదు. కొసరును కట్టడి చేయకపోతే ఇబ్బందులు తప్పక పోవచ్చు.

# బకాయిల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



(మొదటిపేజీ తరువాయి)
ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఖమ్మం లో ప్రదర్శన నిర్వహించి ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నించారు. ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల నుంచి వేలాది మంది విద్యార్థులు ఉప ముఖ్యమంత్రి కార్యాలయ ముట్టడికి భారీ ప్రదర్శనగా వెళ్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడే విద్యార్థులు బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ గత ఐదేండ్లుగా ఫీజు రీయంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం మారిన పాలన మాత్రం మారలేదని విద్యార్థుల పట్ల వివక్ష చూపిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఎనిమిది వేల కోట్ల రూపాయలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో బిటెక్, డిగ్రీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంగా ప్రభుత్వ విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యలు బంద్‌లు పాటిస్తున్నాయని దీనితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు లోకేష్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ నాగులమీరా, మధు, శివ, వంశీ, మనోజ్, జిల్లా నాయకులు ఉస్మాన్, ఉపేందర్, గోపి, వెంకట్, నవీన్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# అడుగుకో గుంత.. ప్రాణ సంకటంగా ప్రయాణం..!

**- పట్టించుకోని అధికారులు**
**- కోట్ల ప్రజాధనం గుంతలో పోసిన పన్నీరు**



ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచ దమ్మపేట సెంటర్ నుండి ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి,సత్తుపల్లి, తదితర ప్రాంతాలకు వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ప్రజలు తమ స్వంత వాహనాలలో రాకపోకలు సాగిస్తుంటారు. వీటికి తోడు ఇసుక ట్రాక్టర్లు, లారీలు తిరుగుతుంటాయి. అడుగుకో గుంత ఏర్పడి ప్రయాణం ప్రాణసంకటంగా మారుతోంది. ఆ రహదారి అంటేనే ప్రయాణీకులు హడలి చస్తున్నారు. మున్సిపాలిటి పరిధి దమ్మపేట సెంటర్ నుండి రెండు కిలోమీటర్ల దూరంలోని కుంటినాగులగూడెం వరకు అడుగుకో గుంత లెక్కన రెండొందల గుంతలు ఏర్పడ్డాయి. వర్షం వచ్చిందంటే చాలు గుంత ఎక్కడుందో రోడ్ ఎక్కడుందో తెలియక నిలిచిన వర్షపు నీటిలో పడి పలువురు గాయాలపాలై ఆసుపత్రుల్లో లక్షలు తగలేశారు. కొందరు మృత్యువాత పడ్డారు. ఇంత జరుగుతున్నా సంబంధిత రోడ్లు భవనాల శాఖ అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దమ్మపేట సెంటర్ నుండి కుంటినాగులగూడెం వరకు గత మూడు సంవత్సరాల క్రితం సుమారు రూ.2 కోట్ల నిధులతో బిటి రహదారి నిర్మించారు. నాణ్యతప్రమాణాలు పాటించకపోవటంతో సంవత్సరం తిరగకముందే ద్వంసం అయింది. కోట్ల ప్రజాధనం గుంతల్లో పోసిన పన్నీరయింది. దమ్మపేట సెంటర్ నుండి కుంటినాగులగూడెం వరకు ఆర్అండ్‌బి రహదారి ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. అభివృద్ధిలో భాగమైన రహదారుల వ్యవస్థను పట్టించుకోకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారుల మరమ్మత్తుల్లో సంభంధిత అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కండ్లకు కనబడుతోంది. అడుగుకో గుంత చొప్పున రెండు కిలోమీటర్ల రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి ఉండటంతో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారుతున్నది. గుంతలతో వాహనాలు మరమ్మత్తులకు గురి అవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అబ్కారీ స్టేషన్ సమీపంలోని మూలమలుపు వద్ద ప్రయాణం మరింత ప్రమాదకరంగా ఉంది. నిత్యం వందలాది భారీ వాహనాలు తిరుగుతుండటంతో వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారుల కండ్లల్లో దుమ్ము దూళీ, కంకర రాళ్ళు ఎగిరివచ్చి పడుతున్నది. దీనితో ప్రయాణీకులు అవస్థలు పడుతున్నారు. రెండు కోట్లు వెచ్చించిన రహదారి రెండు సంవత్సరాలు కూడా మన్నికగా ఉండకపోవటంతో ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గుత్తేదారులు అంతా ఒక్కటై రహదారి నిర్మాణంలో నిర్లక్ష్యం వహించి అందినకాడికి దోచుకుతిన్నారని ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నారు. గత సంవత్సరం క్రితం రాష్ట్ర మంత్రి వస్తున్నారని తాత్కాలికంగా గుంతలలో అక్కడక్కడా కంకర పోసి మమా అనిపించారు. అదికాస్తా ఒక్కరోజులోనే కొట్టుకొనిపోయింది. రహదారి మరమ్మత్తుల విషయంలో పలుమార్లు ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు సంభంధిత అధికారులను ఆదేశించినా పట్టించుకోకుండా మీనమేషాలు లెక్కిస్తూ ప్రజల ప్రాణాలతో ఆటలాడుకొంటున్నారని మండిపడుతున్నారు. ఇకనైనా స్పంధించి రహదారి మరమ్మత్తులు చేయాలని పలువురు కోరుచున్నారు.

# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**ప్రజాపక్షం/ఏన్కూరు :** తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు కోరారు. మంగళవారం ఏన్కూర్ లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అకాల వర్షాలతో రైతుల పంటలకు తీవ్ర నష్టం జరిగిందని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాలతో పత్తి పంటలకు పూర్తిగా నష్టం జరిగిందని మార్కెట్లో రైతులు అమ్మే పత్తి విషయంలో అనేక ఆంక్షలు విదిస్తున్నారని 11 క్వింటల నుండి 7 క్వింటల యకరం పత్తి వరకే అమ్మలనే నిబంధనను ఎత్తివేయాలన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ దేశంలో ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా డిసెంబర్ లో ఖమ్మం లో లక్షలాది మంది తో జరిగే భారీ బహిరంగ సభ ను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్, జిల్లా సమితి సబ్యులు అమారనేని వీరభద్రం, మండల సహాయ కార్యదర్శి బాణోత్ రాంబాబు, మదినేని వెంకన్న, బొగినబోయిన నాగేశ్వరావు పాల్గొన్నారు.

# వార్తలు రాస్తే చేతులు నరికేస్తా

(మొదటిపేజీ తరువాయి)
నోరు ఆగడం లేదు. ఈవిధంగా తన అక్రమ వెంచర్ వేయడమే గాక బెదిరింపులకు పాల్పడుతున్న సదరు ఊసరవెల్లి రియల్ ఎస్టేట్ వెంచర్‌కు ఇచ్చిన తాత్కాలిక అనుమతులను రద్దు చేయాల్సిన అవసరం ఉంది. కొసమెరుపు ఏమిటంటే నోటీసులు ఇస్తాం, అనుమతులు రద్దు చేస్తాం అన్న అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో అవగతం కావడం లేదు. ఈ వెంచర్‌పై సమగ్ర విచారణ జరిపితే వెంచర్ వెనక దాగి ఉన్న అక్రమాలు అనేకం వెలుగు చూసే అవకాశం ఉంది. ఈ తీరుతో అధికార పార్టీకి సైతం కళంకం అంటిస్తుండటం శోచనీయం. సదరు నోటి దూల ఊసరవెల్లి మాట్లాడిన వ్యాఖ్యలపై అధికార పార్టీ నేతలే తప్పు అని ఖండించడం విశేషం.

# గణపేశ్వరాలయాన్ని పరిశీలించిన ఎస్ఐ



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండల కేంద్రంలో గల గణపేశ్వరాలయాన్ని మంగళవారం కూసుమంచి ఎస్ఐ నాగరాజు, ట్రైనింగ్ ఎస్ఐ దివ్యశ్రీ పరిశీలించారు. ఈసందర్భంగా వారు ఆలయ ఛైర్మన్ ప్రదీప్‌రెడ్డి, ఈవో కాముని శ్రీకాంత్‌తో మాట్లాడుతూ బుధవారం నాడు జరగనున్న కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతంగా దైవ దర్శనం చేసుకోవాలని సూచనలు ఇచ్చారు. ఈసందర్భంగా పోలీసు వారు అందుబాటులో భక్తులకు సేవలు కూడా అందిస్తారని ఆలయ బాధ్యులకు తెలిపారు. వారి వెంట శివ భక్తులు తిరుపతిరావు, తదితరులు ఉన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి




**ప్రజాపక్షం/పాల్వంచ :** అర్హులైన పేదలందరికి ఇంటి స్థలంతో పాటుగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ సంఘం) జిల్లా కార్యదర్శి తోలెం మమత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోగల సంఘం కార్యాలయంలో మంగళవారం ముక్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సంధర్భంగా మమత మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి జిల్లాలో దశాబ్దాలుగా ఆదివాసీలకు చెందిన వారు ఒక్కో ఇంటిలో రెండు, మూడు కుటుంబాలు ఉంటున్నాయన్నారు.చాలీచాల ఇండ్లల్లో ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పంధించి అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలన్నారు. అనేక సంవత్సరాలుగా ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనేతర పేదలకు చట్టబద్ధమైన హక్కులు లేకపోవటంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందటం లేవన్నారు. హక్కులను కల్పించి పేద గిరిజనేతరులను ఆదుకోవాలన్నారు.ఈ సమావేశంలో నాయకులు కుంజా సోమక్క, బట్టు సూరమ్మ, గౌంది లక్ష్మి, కంగల గౌతమి, మల్లమ్మ, రత్తమ్మ, సీత, రాజేశ్వరి, తాటి లలిత తదితరులు పాల్గొన్నారు.

# బానోతు జీజాకి నివాళి



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండల పరిధిలోని లింగాలతండా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భానోత్ నాగేశ్వరరావు మాతృమూర్తి బానోతు జీజా అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న కూసుమంచి మాజీ ఎంపీపీ భానోత్ శ్రీనివాస్‌నాయక్, గట్టు సింగారం మాజీ సర్పంచ్ చాట్ల పరశురాం లింగరాం తండా గ్రామంలోని నాగేశ్వరరావు నివాసంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. తొలుత జీజా పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బానోతు రవి, వడిత్య రామ్మూర్తి, వడిత్య బాలాజీ, కుమార్, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

# వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పనిచేయాలి



**-విద్యార్థుల హాజరు శాతంపై దృష్టిపెట్టాలి**
**- ఇంచార్జి జిల్లా కలెక్టర్ డా॥ పి.శ్రీజ**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు రాబోయే పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేవిధంగా పని చేయాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ డా॥ పి.శ్రీజ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థల పనితీరుపై ఇంచార్జి జిల్లా కలెక్టర్ శ్రీజ సంబంధిత శాఖల అధికారులు, కెజిబివి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్స్, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్‌లు, ఎంఈవో లతో మంగళవారం సమీక్షించారు. ఎఫ్ఆర్ఎస్, అపార్, ఆధార్ కార్డు, పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధత తదితర అంశాలపై ఆమె సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో పదవ తరగతి , ఇంటర్ పరీక్షలు చాలా కీలకమన్నారు. జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థల నుంచి పదవ తరగతి, ఇంటర్ చదివే పిల్లలు రాబోయే పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వారానికి రెండు సార్లు ఫోన్ చేసి పిల్లల చదువుపై ఫాలోఅప్ చేయాలన్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనకబడి ఉన్నారు పరిశీలించి అందులో వారికి అవసరమైన మేర అదనపు శిక్షణ అందించాలన్నారు. ముఖ్యమైన పాఠ్యాంశాలను అనేకసార్లు బోధిస్తూ పాస్ అయ్యేవిధంగా ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఎఫ్ఆర్ఎస్‌లో వంద శాతం నమోదై, హాజరు వేయాలని, విద్యార్థుల హాజరు శాతంపై శ్రద్ధ పెట్టాలన్నారు. గైర్హాజరవుతున్న విద్యార్థులను ఫాలోఅప్ చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి అపార్ నెంబర్ ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. యుడైస్ పోర్టల్‌లో నమోదైన ప్రతి విద్యార్థి వివరాలు నమోదు చేయాలన్నారు. మండల విద్యాశాఖాధికారులు సమర్థవంతం గా పర్యవేక్షణ చేయాలన్నారు. మండల వారీగా, విద్యా సంస్థల వారీగా ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు శాతం సమీక్ష చేసి హాజరు శాతం 90 శాతానికి ఎక్కువగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెడ్ మాస్టర్ల హ్యాండ్ బుక్‌ను ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి , మండల విద్యాశాఖాధికారులు, కెజిబివి ప్రత్యేకాధికారులు, కళాశాల ప్రిన్సిపాల్స్, విద్యాశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపు

**-ర్యాండమైజేషన్ ద్వారా అలాట్ చేసిన అదనపు కలెక్టర్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ ద్వారా డబుల్ బెడ్‌రూం ఇండ్లను పారదర్శకంగా లబ్దిదారులకు కేటాయించామని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం రఘునాథపాలెం మండలం చిమ్మపుడి గ్రామంలో లబ్దిదారులకు లబ్దిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను కంప్యూటర్ ర్యాండమైజేషన్ ద్వారా అలాట్ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అలాట్‌మెంట్ చేసిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. చిమ్మపుడి గ్రామంలో నిర్మించిన 48 డబుల్ బెడ్ రూం ఇండ్లకు గతంలోనే లబ్దిదారుల ఎంపిక పూర్తి చేశామని ప్రస్తుతం ఎంపిక చేసిన లబ్దిదారులకు ఇండ్ల కేటాయింపు జరుగుతుందన్నారు. ఏ లబ్దిదారునికి ఏ నెంబర్ ఇంటిని కేటాయించాలనే అంశం పూర్తి పారదర్శకంగా ఎటువంటి పైరవీలు లేకుండా ఆన్‌లైన్ ద్వారా కేటాయించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఆర్ఐ వహిద్, ఈడిఎం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# సిసిఐ నిబంధనలను మార్చాలి : లింగాల



**ప్రజాపక్షం/ మధిర :** రైతులందరికీ ఉపయోగపడే విధంగా సిసిఐ నిబంధనలను మార్చాలని జిల్లాపరిషత్ మాజీ చైర్మన్, మధిర నియోజకవర్గ బిఆర్ఎస్ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఖాజీపురం గ్రామంలోని జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని బిఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించారు. ఈసందరర్భంగా ఆయన మాట్లాడుతూ వారంరోజుల కాలంలో కేవలం 180క్వింటాళ్ళ పత్తిని మాత్రమే కొనుగోలు చేశారని, సిసిఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయటం వల్ల పెద్దగా ఉపయోగం లేకుండా పోయిందని అన్నారు. సిసిఐ కేంద్రం రైతులకు ఉపయోపడే విధంగా నిబంధలను మార్చాలని, రైతుల స్లాట్ బుక్ చేసుకునే విధానం మార్చాలన్నారు. తేమశాతం పరీక్ష కేంద్రాలు గత బిఆర్ఎస్ ప్రభుత్వ యాంలో గ్రామంలో ఉండేదని ఇప్పటికీ అదే విధానాన్ని కొనసాగించాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితి వలన పత్తిలో తేమశాతం 18వరకు ఉన్న ప్రభుత్వం కొనుగోలు చేయాలని,అసరమైతే రాష్ట్ర ప్రభుత్వమే నష్టపరిహారం భరించాలని, కొనుగోలు కేంద్రాలు మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, రైతు నాయకులు చావా వేణు, వంకాయాలపాటి నాగేశ్వరరావు, కటికల సత్యనారాయణరెడ్డి, వీరారెడ్డి, మారబోయిన ప్రసాద్, మేడిశెట్టి నాగేశ్వరరావు, ఆళ్ల నాగబాబు, వెంపటి నాగేశ్వరరావు, అమరవాది కోటిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# పోలీసులకు చేతకాకపోతే మాకు వదిలేయండి

**సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి గోపాలరావు**





**ప్రజాపక్షం/చింతకాని:** రామారావు హత్యకేసును నీరుగార్చేందుకు పోలీసులు యత్నిస్తున్నారని, నిందితులను పట్టుకోవడం పోలీసులకు చేతకాకపోతే తాము పట్టుకుంటామని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన నిరసన ర్యాలీలో భాగంగా మంగళవారం చింతకాని మండల కేంద్రంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సామినేని రామారావుని హత్యచేసిన కాంగ్రెస్ గుండాలని అరెస్ట్ చేయాలని నిరసన గళం పేరుతో భారీ ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా మడిపల్లి గోపాలరావు మాట్లాడుతూ హత్యజరిగి నేటికి ఐదు రోజులు గడిచినా పోలీసుల విచారణలో ఎటువంటి పురోగతి లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. పాతర్లపాడు కాంగ్రెస్ గూండాలు హత్యచేసారని రామారావు సతీమణి పోలీసులను ఫిర్యాదు చేసినా నిందితులను నేటి వరకు కనీసం అరెస్ట్ చేయకపోవడం పోలీసుల వైఫల్యమన్నారు. రామారవుది రాజకీయ హత్యకాదని కాంగ్రెస్ నాయకులు విస్తృత ప్రచారం చేయడం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు.సీపీఎం నాయకులకు మతిభ్రమించిందని కాంగ్రెస్ నాయకులు తప్పుడు మాటలు మాట్లాడటం తగదన్నారు. ఇతర ప్రాంతాల్లో హత్యలు జరగలేదా , అక్కడ హత్యలు ఎందుకు జరిగాయని కాంగ్రెస్ నాయకులు లేవనెత్తుతున్నారంటే కాంగ్రె నాయకులకు ఈ హత్యతో సంబంధం ఉందనిపిస్తుందన్నారు. పోలీసులకు మూడు రోజులు గడువిస్తున్నామని ఈలోపు నిందితులను అరెస్ట్ చేయకపోతే తదనంతరం జరిగే పరిణామాలకు పోలీసులే భాధ్యత వహించవలసి వస్తుందని పరోక్షంగా హెచ్చరించారు.ఈ ర్యాలీలో పార్టీ మండల కార్యదర్శి రాచబంటి రాము, నాయకులు వత్సవాయి జానకిరాములు, గడ్డం కోటేశ్వరరావు, ఆలస్యం రవి, పులి యజ్ఞనారాయణ,దేశబోయిన ఉపేందర్, మాదినేని రవి, కాటబత్తిన వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వెజిటేబుల్ కార్వింగ్ పోటీలు



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్ హైస్కూల్ నందు మంగళవారం వెజిటేబుల్ క్వారింగ్ పోటీలు ఘనంగా నిర్వహించారు. వెజిటేబుల్ క్వారింగ్ పోటీల్లో భాగంగా ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు టమోటా, క్యారెట్, బీట్ రూట్, దోసకాయ, కాబేజి, ముల్లంగి, వంకాయ, గుమ్మడికాయ వంటి కూరగాయాలను ఉపయోగించి అందమైన ఆకారాలు, పువ్వులు, జంతువులు, ఆకులు తదితర రూపాలు తయారు చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ మేరీ థామస్, ప్రిన్సిపాల్ ఆన్‌బేబి మాట్లాడుతూ వెజిటేబుల్ క్వారింగ్ పోటీల వలన విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి అలంకరణతో భోజనాన్ని ఆకర్షణీయంగా చూపించడానికి, కళాత్మక కళలో ప్రత్యేకత చూపించడానికి,పండుగ వేడుకల్లో, హోటల్స్, వంట పోటీల్లో ఫుడ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శించడానికి ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సామినేని హత్యపై సమగ్ర విచారణ జరపాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కాంగ్రెస్ గుండాల చేతుల్లో హత్య గావించిన కామ్రేడ్ సామినేని రామారావు హత్యపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని, దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని సిపిఎం సత్తుపల్లి పట్టణ, మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన నిరసన ర్యాలీ పాత సెంటర్ నుండి బస్టాండ్ చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావులు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల సహకారం, ప్రోత్సాహంతోనే రామారావు హత్య జరిగిందని, హత్య వెనుక ఉన్న కుట్ర దారులతో పాటు హత్య చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు తలగకుండా దోషులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. మంత్రి బట్టి విక్రమార్క సాగిస్తున్నది ప్రజా పాలన అయితే కేసు విచారణకు సహకరించి దోషులను కఠినంగా శిక్షించేలా పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. మధిర నియోజకవర్గంలో నాటి మార్సిస్ట్ అధికారంలో ఉన్న రోజులు ప్రజాస్వామ్యం పరిణవిల్లిందని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కమ్యూనిస్టులతో పాటు ప్రత్యర్థులను హత్య చేయడమే కాంగ్రెస్ లక్ష్యంగా మారడం దురదృష్టకరమన్నారు. ప్రజా పాలన ముసుగు లో కాంగ్రెస్ ఆటవిక పాలన సాగించడాన్ని కమ్యూనిస్టులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. సిపిఎం నాయకులు, రావుల రాజబాబు, సిపిఎం మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, సిపిఎం నాయకులు బాల బుచ్చయ్య, చావా రమేష్, ఎస్కే వలి, భాస్కర్, జిలాని సైదా,రాము, కావూరి వెంకటేశ్వరరావు, కోటయ్య, అర్జున్, భాష, మీరాజ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# చిలక రమాదేవి మృతి పట్ల ఆర్ఎంపిల సతాపం



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండల పరిధిలోని జానకిపురం గ్రామానికి చెందిన ఆర్ఎంపి వైద్యులు చిలక లక్ష్మ ణ్ భార్య చిలక రమాదేవి అనారోగ్యంతో అకాల మృతి చెందారు. మంగళవారం ఆమె భౌతికకాయాన్ని తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు, బోనకల్ మండల అధ్యక్షులు యంగల గౌతం, కార్యదర్శి బాలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి మృతి గల వివరాలను అడిగి తెలుసుకుని కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో కొంగర గోపి, గణపతి, నజీరు, వెంకటేశ్వర్లు, రామన్, వెంకటకృష్ణ, సురేష్, కర్ణం తదితరులు ఉన్నారు.

# హత్యపై కాంగ్రెస్ మార్క్ విచారణ




### -రాజకీయ హత్యలకు భట్టివిక్రమార్కే బాధ్యత వహించాలి : పోతినేని
### -రామారావు హత్యపై సిపిఎం నిరసన ర్యాలీ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఎం రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హత్యపై ఖమ్మం పోలీసులు కాంగ్రెస్ మార్క్ విచారణ జరుపుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ ఆరోపించారు. రాజకీయ కోణంలో పోలీసులు విచారణ జరపకుండా కళాశాలలు, ఇతరత్రా వైపు విచారణ కొనసాగిస్తూ పూర్తిగా పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సామినేని రామారావు హత్యకు నిరసనగా దోషులను వెంటనే కనుగొని శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖమ్మంలో సిపిఎం ఖమ్మం రూరల్ మండలం ఖమ్మం డివిజన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పెవిలియన్ మైదానం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు జరిగిన ఈ ర్యాలీని ఉద్దేశించి పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ ఈ హత్య గురించి పోలీసులు పట్టించుకోవడం లేదని ఇందుకు ఖమ్మం పోలీస్ కమిషనర్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మార్క్ విచారణ జరుపుతున్నారని ఇందులో భాగంగా ప్రశ్నించే వారిని ముద్దాయిలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని సుదర్శన్ ఆరోపించారు. ఖమ్మం పోలీసులు సరికొత్త విచారణకు నాంది పలుకుతున్నారని ఆయన తెలిపారు. భట్టి విక్రమార్క ఇందుకు బాధ్యత వహించాలని సుదర్శన్ స్పష్టం చేశారు. మా సారు ఉన్నారు మా మేడం ఉంది మాకేం కాదనే రీతిలో కాంగ్రెస్ కార్యకర్తలు వ్యవహరిస్తున్నారని అటువంటి హంతకులను కాపాడే ప్రయత్నం చేయడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని సుదర్శన్ ఆరోపించారు. జిల్లాలో ఎక్కడ జరగకుండా మధిర నియోజక వర్గంలోనే రాజకీయ హత్యలు ఎందుకు జరుగుతున్నాయని ఆయన ప్రశ్నించారు. ఐదు రోజులైనా ఇంత వరకు క్లూస్ టీంలు, కానీ డాగ్ స్కాడ్‌లు కానీ ఎటువంటి ఆధారాన్ని కనుగోనలేకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. పోలీసులు విచారణ జరిపి దోషులను తేల్చకపోతే ప్రజలే దోషులను తేల్చి శిక్షిస్తారని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా చట్టబద్ధంగా పోలీస్ విచారణ సాగించాలని ఆయన కోరారు. ఈ నిరసన ప్రదర్శనలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు వై. విక్రం, బండి రమేష్, మాచర్ల భారతి, బండి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# 15న ప్రత్యేక లోక్ అదాలత్
### -న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ రాజగోపాల్




**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** నవంబర్ 15న ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి. రాజగోపాల్ తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసులు, బ్యాంకర్లు, చిట్ ఫండ్ ప్రతినిధులు తదితరులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్ పట్ల గ్రామీణ ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. సమావేశంలో మొదటి అదనపు న్యాయమూర్తి ఉమాదేవి, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, అధికారులు, చిట్ ఫండ్, ఇన్సూరెన్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పట్టు పురుగుల పెంపకంతో అధిక దిగుబడి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం రెబ్బవరం గ్రామంలో గల పట్టు రైతు శేషగిరిరావు పట్టు పురుగుల పెంపకంలో 20 రోజుల్లో రూ.72వేలు రాబడి పొందారు. దీనిని ఏ.ముత్యాల(డిడి సెరికల్చర్) ఖమ్మం వైరా డివిజన్ ఉద్యాన అధికారి ఆకుల వేణు, ఏఎస్‌వోలు సిహెచ్.కామేశ్వర రావు, బి.దేవరాజు పట్టు పంటను పరిశీలించారు. రెబ్బవరం గ్రామంలో ఇప్పటివరకు 12 మంది రైతులు 25వేల ఎకరాల మల్బరీ పంటను సాగు చేస్తున్నారు. పట్టు పరిశ్రమ అన్ని పంటల కంటే అత్యధిక ఆదాయం తక్కువ ఖర్చు తక్కువ సమయంలో వస్తుందని తెలియజేశారు. కొత్తగా పట్టు పరిశ్రమ చేద్దామనుకున్న రైతులకు ప్రభుత్వం ద్వారా షెడ్లను నిర్మించడానికి జనరల్ రైతులకు రూ.2.25లక్షలు, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.292500లు, మల్బరీ తట పెంచడానికి జనరల్ రైతులకు రూ.6వేలు, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.8వేలు ప్రభుత్వం ద్వారా అందించబడుతుంది. ఈ పట్టు పరిశ్రమ చేయుటకు ఆకస్తి ఉన్న రైతులు ఏ.ముత్యాలు 8977714573, ఆకుల వేణు 8977714105, బి.దేవరాజ్ 9966435542 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# నగదు రహిత లావాదేవీలతో అనేక ప్రయోజనాలు




**ప్రజాపక్షం/కల్లూరు:** నగదు రహిత లావాదేవీలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని సిఆర్ పి అనిత అన్నారు. మండల పరిధిలోని పెద్ద కోరుకొండిలో మంగళవారం నగదు రహిత లావాదేవీలపై అవగాహన కార్యక్రమం మదర్ తెరిసా గ్రామ సమైక్య మహిళలకు అవగాహన కార్యక్రమం జరిగింది. వాడుకలో సౌలభ్యం ఎప్పుడైనా ఎక్కడైనా ఏదైనా మోడ్ సురక్షిత లావాదేవీలు ఆర్థిక చేరిక సులభతరం డిజిటల్ చెల్లింపులపై ప్రోత్సాహం క్యాష్ బ్యాక్ ఆఫర్‌లు నగదు పోతుందని లేదా నకిలీ కరెన్సీని పొందవచ్చు అని భయం లేదని నగదు నిర్వహించాల్సిన అవసరం లేదని ఇంటి నుంచి సౌకర్యం చేతి వేళ్ళ మీద బ్యాంకింగ్ త్వరిత, సురక్షిత చెల్లింపుల ద్వారా సమయాన్ని ఆదా చేస్తుందని ఏ సమయంలోనైనా ఇంటిలో నుంచి లావాదేవీలు సెల్ ఫోన్ ద్వారా నిర్వహించుకోవచ్చు అని అన్నారు. ఇబ్బందులు లేకుండా ఎక్కడికైనా ఏ ప్రాంతానికైనా ఏ సమయములోనైనా లావాదేవీలు జరుపుకోవాలని దీనిద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. నగదు రహిత లావాదేవీలపై అన్ని గ్రామ సమైక్యలలో, సమైక్య లీడర్లకు, గ్రూపు లీడర్లకు సభ్యులకు అవగాహన కార్యక్రమాలు ఈ నెల చివరి కల్లా పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సమైక్య సభ్యులు స్వయం సహాయక సంఘాల సభ్యులు లీడర్లు పాల్గొన్నారు.

# వైరా బస్టాండ్‌లో రూ.50వేలు నగదు అపహరణ



**ప్రజాపక్షం/వైరా:** వైరా బస్టాండ్‌లో వరుస దొంగతనాలు కొనసాగుతూనే ఉన్నాయి. బస్టాండ్ సిసి కెమెరాలు పర్యవేక్షణ లేకపోవడం కూడా వరుస దొంగతనాలకు కారణం అవుతున్నాయి. మంగళవారం వైరా బస్టాండ్‌లో తాటిపూడి గ్రామానికి చెందిన మహిళ పరుసులో నుంచి రూ.50వేలు నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. అదేవిధంగా గత వారం రోజులు క్రితం ఐదు సెల్‌ఫోన్‌లు కూడా వైరా బస్టాండ్‌లో దొంగతనానికి గురయ్యాయి. ఇలా వరుస దొంగతనాలు పదేపదే బస్టాండ్‌లో జరగడంతో పలువురిని కలవరపెడుతున్నాయి. బస్టాండ్‌లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెంచితే దొంగతనాలకు ఆకతాయిలకు అడ్డుకట్ట వేయవచ్చు అని పలువురు తెలుపుతున్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కార్తీక పౌర్ణమి సందర్భంగా నేలకొండపల్లి మండలం లోని రాజేశ్వరపురం లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమెయ్యాయి. ఈ పోటీలను మాజీ సర్పంచ్ ఎర్రబోయిన నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు అడపాల రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో క్రీడలు జాతీయ స్థాయి వరకు రాణించాలని సూచించారు. యువత మధ్య స్నేహభావం పెంపోందిస్తుందని అన్నారు. కనుమరుగవుతున్న గ్రామీణ క్రీడలను కాపాడాల్సిన భాద్యత నేటి యువత పై ఉందని అన్నారు. జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు సహకరిస్తున్న ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చిట్యాల రమేష్, యం.సుధీర్, పగిళ్ల ఆశోక్, వెంకన్న, రెడ్డబోయిన నవీన్, ఎన్.బాబు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్టు సత్యంకి మాతృవియోగం
### - నివాళులర్పించిన జర్నలిస్టులు





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలం సీనియర్ జర్నలిస్ట్ చిరసవాడ సత్యం మాతృమూర్తి నాగమ్మ అనారోగ్యంతో వారి స్వగృహంలో కన్నుముశారు. మంగళవారం ప్రధాన పత్రికల సీనియర్ జర్నలిస్టులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కుమారులు సత్యం, వెంకటేశ్వర్లును పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపి మనోధైర్యం కల్పించారు. అభ్యుదయ భావాలు కలిగిన నాగమ్మ కుమారులను,కుమార్తెను ఆదర్శపౌరులుగా తీర్చిదిద్దారని వారు కొనియాడారు. ఆమె మృతి కుటుంబానికి తీరని లోటని తెలిపారు. గ్రామస్తులు, బంధువుల అశ్రునయనాల నడుమ నాగమ్మ అంతిమయాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఉబ్బని సుందర్, పప్పుల సుధాకర్, గోవింద్, వెంకట్, మేకల నాగరాజు, కూరపాటి విజయ్, గుజ్జ రామకృష్ణ, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కోతల సమయంలో వరి మళ్లలో నీరు
### తుఫాను తెచ్చిన తంట



**ప్రజాపక్షం/పెనుబల్లి:** నైరుతి రుతుపవనాలు సరైన సమయంలో రావడం వలన ఈ ఏడాది వరి పండించే రైతులకు ఆరంభంలో వ్యవసాయ సీజన్ శుభ పరిణామంగా మొదలైంది. ఆ తర్వాత వరి పంటకు కావలసినంత వర్షపాతం పడటం రైతులకు తిరుగు లేదనిపించింది. క్రమం తప్పకుండా కురిసిన వర్షాలు వలన చెరువు తూములు తీయకుండానే వరి పంట కోతలు కొచ్చాయి. అక్టోబర్ నెల చివరిలో వచ్చిన తుఫాన్ పత్తి రైతులతో పాటు వరి పండించే రైతులకు కూడా అశనిపాతంగా మారింది. తీవ్ర నష్టం కలిగించింది. భారీ నష్టం కలిగించకపోయినా వరి పొలాల్లో నిలిచిన నీరు పూతలకు ఆటంకంగా మారడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. కోతలకు వచ్చిన వరి పనలు పడిపోవడం వలన కోతలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం పెనుబల్లి మండలంలో రైతులు సాగు చేసిన వరి పంట దాదాపు కోతలకు సిద్ధమయింది. అదే సమయంలో వరి మళ్లల్లో నిలిచిన నీళ్ల వల్ల కోతలకు ఆటంకమేర్పడుతుంది. నీటిని పూర్తిగా బయటకు పంపిస్తేనే వరి కోయడానికి అనువుగా ఉంటుంది. నీరు ఏ మాత్రం ఉన్నా మెషిన్లు దిగబడి పోతాయి. నాగార్జున సాగర్ కాలువ, చెరువులు, బోర్లు కింద పండించిన వరి పంట అంతా కోతల కొచ్చింది. పక్వానికి వచ్చిన వరి కంకులు ఎండే సమయంలో వచ్చిన తుఫాను కింద ఆరకుండా చేసింది. తేమ అధికంగా ఉంటే కొనుగోలు కేంద్ర నిర్వాహకులు రైతులను ఇబ్బందులు పెట్టే అవకాశం ఉంది. గిట్టుబాటు ధర కూడా తగ్గుతుంది. మండలంలో వరి కోతలు అక్కడక్కడా ఇప్పుడే ప్రారంభమయ్యాయి. మరో వారం పది రోజులు పాటు వర్షాలు పడకుండా ఉంటే పొలాలలో నిల్వ ఉన్న నీరు తగ్గే అవకాశం ఉంది. వరి పంటకు నీరు ఎంత అవసరమో పంట దిగుబడి సమయంలో మడుల్లో పూర్తిగా నీరు లేకుండా ఉంటేనే కోతలకు అనుకూలంగా ఉంటుంది. మంచి రాబడిని ఆశించి అధిక పెట్టుబడులతో రైతులు పంటను సాగు చేస్తారు. పంట కోత కోసి దిగుబడి ఇంటికొచ్చేవరకు రైతులు ప్రకృతి దయా దక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తుంది.

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంజెపి కూసుమంచి విద్యార్థి ఎంపిక



**ప్రజాపక్షం/కూసుమంచి:** ఈనెల 4వ తారీఖున కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన అండర్ 17 అంతర్ జిల్లా కబడ్డీ క్రీడా పోటీలలో మహాత్మ జ్యోతిబాపూలె కూసుమంచి గురుకుల విద్యార్థి ఎస్ విగ్నేష్ 10వ తరగతి అద్భుత ప్రతిభ కనబరిచి ఈనెల 8న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏడూళ్ళబయ్యారం నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయ్యాడు. ఈ క్రీడాకారున్ని ఉమ్మడి జిల్లా బిసి గురుకులాల ఆర్సిఓ సిహెచ్ రాంబాబు, పాఠశాల ప్రిన్సిపల్ పి మల్లయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు బి నరసింహ, పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది అభినందించారు.

# జిన్నింగ్ మిల్లులు యధావిధిగా కొనసాగించాలి

**- రైతు ప్రయోజనాల దృష్ట్యా బంద్‌లో ఎవ్వరూ పాల్గొనరాదు : కలెక్టర్ జితేష్ వి పాటిల్**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం** జిన్నింగ్ మిల్లులు యధావిధిగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల యజమాన్య ప్రతినిధులు, మార్కెటింగ్ శాఖ అధికారులు, సిసిఐ ప్రతినిధులతో కలెక్టర్ ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 6 నుండి రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్ మిల్లులు బంద్ చేయాలనే ఉద్దేశ్యంతో ఉన్నాయని, కానీ జిల్లాలోని మిల్లులు బంద్ చేయరాదని చెప్పారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మిల్లులు నడపాలనే నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. జిల్లాలో ఎల్1,2,3 రకాల సమస్యలు లేకపోవడంతో బంద్ అవసరం ఉండదని, ఇప్పటికే జిల్లాలో రైతులు వర్షాల కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పత్తి కొనుగోలు, ప్రాసెసింగ్ ప్రక్రియలో అంతరాయం వాటిల్లకుండా అన్ని మిల్లులు నిరాటంకంగా పనిచేయాలని ఆదేశించారు. పత్తి తేమ 12 శాతానికి మించకుండా రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, దీనిపై మార్కెటింగ్ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మార్కెటింగ్ యార్డుల్లో పత్తి ఆరబెట్టేందుకు తగిన సౌకర్యాలు కల్పించి పత్తిలో తడిచేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు సమయానికి పత్తిని తీసుకురావడంతో పాటు మిల్లులు నిటాంకంగా కొనుగోలు చేయడం ద్వారా జిల్లా వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థ సజావుగా కొనసాగుతుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి, సిసిఐ బయ్యర్లు, జిల్లా మార్కెటింగ్ కమిటీల కార్యదర్శులు, జిన్నింగ్ మిల్లుల యాజమాన్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిల విడుదలకు కృషి చేయండి

**- విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి**
**- ఎంఎల్‌ఏ డా.తెల్లంకు ఏఐఎస్ఎఫ్ వినతి**



**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న రూ.8500 కోట్ల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదలయ్యేందుకు, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంఎల్ఏ డా. తెల్లం వెంకటరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు భద్రాచలం చేరుకున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రతినిధి బృందం మంగళవారం ఎంఎల్ఏను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా విద్యార్థులు పీజు రీయింబర్స్మెంట్, ఉపకార వేతనాలు విడుదల అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని, తద్వారా చదువులు సాగే పరిస్థితి లేకుండా పోయిందని మండిపడ్డారు. బకాయిల కోసం కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుంటే విజిలెన్స్ దాడులు నిర్వహిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల జీవితాలతో పాలకులు ఆటలాడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదనీ, ఇలాంటి చర్యలను ఏఐఎస్ఎఫ్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఇప్పటికైనా పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇచ్చిన వినతి పత్రంపై ఎంఎల్ఏ స్పందించారని, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఇనపల్లి పవన్ సాయి, జిల్లా ఉపాధ్యక్షులు అక్కినపల్లి నాగేంద్రబాబు, నాయకులు రమణ, పవన్, ఉదయ్, మానస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల ఫిర్యాదులపై జాయింట్ విచారణ

**జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో ఆరా**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని శంకరగిరి తండా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పై స్థానికులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మండల పరిషత్, రెవిన్యూ అధికారులు మంగళవారం జాయింట్ విచారణ చేపట్టారు. ఇందిరమ్మ ఇళ్ల ను పొందిన లబ్ధిదారులు ఇళ్లలో ఉండటం లేదని, కొంత మంది విక్రయిస్తున్నారని స్థానికులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. కాగా తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ లు జాయింట్‌గా విచారణ చేపట్టారు. ప్రస్తుతం ఇంట్లో ఉంటున్న వారి గురించి ఆరా తీశారు. రెండు ఇళ్లు ఖాళీగా ఉండటంతో వారిని పిలిపించి ఇంట్లో ఉండాల్సిందేనని లేకుంటే రద్దు చేస్తామని ఆదేశించారు. అర్హత లేని వారికి ఇళ్లు మంజూరు తచేశారని పేర్కొన్నారు. వారికి స్థలం ఉన్నందున్న రెండింటిలో ఒకటి రద్దు చేసుకోవాలని సూచించారు. ఇళ్ల ను విక్రయించే వారి గురించి వివరాలు సేకరించారు. నిబంధనలు ఉల్లంఘించి విక్రయిస్తే చర్యలు త్రీవంగా ఉంటాయని హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో విచారణ అనంతరం నివేదిక ను జిల్లా కలెక్టర్ కు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ విచారణ లో మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్లు ఆలస్యం మధుసూధన్ రావు, అల్లం రవికుమార్, జీపీవో జానకిరాములు, పంచాయతీ కార్యదర్శి పవన్ పాల్గొన్నారు.

# రైతులు దళారులను ఆశ్రయించకండి

**కూసుమంచి ఏడీఏ సతీష్**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రైతులు దళారులను ఆశ్రయించవద్దని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు సతీష్ సూచించారు. మండలం లోని ఆచార్లగూడెం, అనాసాగారాం గ్రామాలలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ను అందించేందుకు కొనుగోలు కేంద్రాల ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు తొందరపడి దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతు ధర ను పొందాలని సూచించారు. రైతాంగం కోసం మండలం లోని 20 కొనుగోలు కేంద్రాల ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటిచైర్మన్ వెన్నపూసల సీతారాములు, మండల వ్యవసాయాధికారి యం.రాధ, ఏఈవో అరవింద్, డీసీఎంఎస్ సిబ్బంది నవీన్, గోపి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి పోటీలకు గురిదేవ్ విద్యార్థులు ఎంపిక



**ప్రజాపక్షం/చర్ల :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో స్థానిక గురుదేవ్ విద్యాలయానికి చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 9వ తరగతి చదువుతున్న నందగోపాల్, సుశాంత్‌లు హ్యాండ్ బాల్ పోటీల్లో తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయులు హెచ్ జివి ప్రసాద్, అకడమికి కో ఆర్డినేటర్ ఎంవి సుబ్రహ్మణ్యం, జి శ్రీనివాస్ విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా విజయం సాదించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రీడల్లో రానించేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

# గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయండి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా కేంద్ర గ్రంధాలయాభివృద్ధితో పాటు జిల్లాలో ఉన్న పలు గ్రంధాలయా అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ గ్రంధాలయ చైర్మన్ వీరబాబు, గ్రంధాలయ కార్యదర్శి కె.కరుణకుమారి మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రంధాలయంలో అనేక మౌళిక సదుపాయాల అవసరం ఉందని, ఆదే విధంగా జిల్లాలో ఉన్న పలు గ్రందాలయాల అభివృద్ధికి స్థల సేకరణ అవసరం ఉందని అన్నారు. గ్రంధాలయాలను అభివృద్ధి పర్చడం ద్వారా అనేక మంది పోటీ పరీక్షలకు సిద్ధ పడే వారికి, పాఠకులకు ఉపయోగ కరంగా ఉంటుందని ఆ వినతి పత్రంలో కోరారు. దీనిపై కలెక్టర్ స్పందించారని గ్రంధాలయాల అభివృద్ధి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసి వారిలో అఫీస్ ఇంచార్జ్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాలల సదనాన్ని పరిశీలించిన మెజిస్ట్రేట్



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం బాలల సదనాన్ని మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సదన పరిసరాలను పరిశీలించిన ఆయన చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించారు. సదనంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సౌకర్యాల లభ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలు ఆనందంగా, సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అంకం సర్వేశ్వరరావు, మణుగూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు రవికుమార్, విజయరావు, పద్మావతి, పోషం భాస్కర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కిరాణ షాపుల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీ



**ప్రజాపక్షం/గుండాల :** మండల కేంద్రంలో మంగళవారం ఫుడ్‌సేఫ్టి అధికారులు కిరాణ షాపుల్లో కూల్‌డ్రింక్స్ , కల్తి వస్తువులు, చాక్లెట్స్, బిస్కెట్స్ తిను బండారాలను వంటి వస్తువులపై తనికీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టి అధికారి శరత్, ఎనాలసిస్ అధికారి రతన్ మాట్లాడుతూ కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ అమకాలు జరుగుతున్నాయనే సమాచారంతో షాపుల్లో తనికీలు నిర్వహించడం జరిగిందన్నారు. షాపు యజమానులు విదిగా లైసెన్స్‌లను పొందాలని సూచించారు. 15రోజుల గడువులోగ లైసెన్స్ తీసుకోవాలని కోరారు. దుకాణ దారులు లైసెన్స్ పొందని వారిపై చర్యలు తప్పవని , కాలం చెల్లిన డిక్స్ అమ్మిన వారిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలో రాష్ట్రియా లోక్‌దళ్ ఆధ్వర్యంలో జన చైతన్య రథయాత్ర ములకలపల్లి మండలంలో ప్రచార రథంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈసందర్భంగా ప్రభుత్వం గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, కరపత్రాల ద్వారా ప్రజలను చైతన్యం పరుస్తూ గ్రామ గ్రామాన రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించాలని ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాష్ట్రీయ లోకదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడకం ప్రసాద్ దొర, ములకలపల్లి మండల అధ్యక్షులు వాడే రమేష్, కొండ్రు బాబురావు, పెంటయ్య, బాలకృష్ణ, పాల్గొన్నారు.

# రైతులకు భూసార పరీక్ష పత్రాల పంపిణీ



**ప్రజాపక్షం/ గుండాల :** రైతు నేస్తం కార్యక్రమం ద్వార వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిదిలోని రైతు వేదిక నందు రైతులకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు చేతుల మీదుగా భూసారపరీక్ష పత్రాలను అంచేసినట్లు మండల వ్యవసాశాకాధికారి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు భూసార పరీక్షయెక్క అవశ్యకతను విరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు వ్యవసాయాదికారి సతీష్, ఎఇఒలు పాల్గొన్నారు.

# మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమర్ధవంతంగా ఉండాలి

**- కలెక్టర్ జితేష్ వి పాటిల్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం** అమృత్ 2.0 పథకం క్రింద జిఎస్ఐ ఆధారిత మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమర్ధవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఇందు కోసం అవసరమైన ఖచ్చితమైన వివరాలను సంబంధిత శాఖల అధికారులు సమయానికి అందించాలని ఆయన ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో డిటిసిపి ప్రాజెకు డైరెక్టర్ అశ్విని ఆధ్వర్యంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ మాస్టర్ ప్లాన్ రూపకల్పన మొదటి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రూపొందించడం, భవిష్యత్ పట్టణాభివృద్ధికి మార్గదర్శకం. అందువల్ల ప్రతిశాఖ ఖచ్చితమైన తాజా సమాచారాన్ని అందించాలని సూచించారు. రెవెన్యూశాఖ నుండి లభించే సర్వే నెంబర్లు, వాటి పరుదులు, భూమి వినియోగం వివరాలు కీలకమని, అవి మాస్టర్ ప్లాన్‌కు ఆధారంగా ఉంటాయని తెలిపారు. తాగనీటి సరఫరా అంశంపై ప్రజారోగ్య, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో సమగ్ర సమాచారం అందించాలని సూచించారు. ఆర్అండ్‌బి అధికారులు ప్రస్తుత రహదారులతో పాటు బైపాస్ రహదారుల నిర్మాణానికి అనువైన ప్రదేశాలను సూచించాలని ఆదేశించారు. అటవీ, విద్యుత్, రవాణఆ, రైల్వే, పరిశ్రమలు తదితర శాఖల పరిధిలోని అన్ని వివరాలను సమగ్రంగా సమర్పించాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల స్థానాలను కూడా మాస్టర్ ప్లాన్‌లో ప్రతిబింబించాలని, పట్టణ ప్రస్తుత పరిస్థితి అర్ధం చేసుకోవడమే కాకుండా రానున్న 20సం.ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రాదేశిక వివరాలను సేకరించాలని సూచించారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా డిజిటల్ మ్యాపింగ్ నిర్వహించి భూ వినియోగం మ్యాప్‌లు రూపొందించవచ్చని కలెక్టర్ తెలిపారు. సమగ్రప్రణాళిక ద్వారా భవిష్యత్ పట్టణాభివృద్ధికి అవసరమైన భూమి వినియోగం, భవన నిర్మాణం , రావాణా, ఇతర మౌళిక వసతుల అభివృద్ధికి దోహద పడుతుందని చెప్పారు. జనాభా పెరుగుదల, పట్టణ విస్తరణను దృష్టిలో పెట్టుకుని ప్రజా అవసరాలకు అనుగుణంగా గృహాలు, తాగునీరు, రహదార్లు, ఇతర సదుపాయాలను ప్రణాళికా బద్దంగా కల్పించాలని అన్నారు. ఈ ప్రక్రియను ఆర్‌డిఓలు, తహశిల్దార్లు పర్యవేక్షించాలన్నారు. సమగ్ర విచారణ అధారంగా డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ రూపొందించబడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం డిఎస్‌పి రెహమాన్, ఆర్‌డిఓ మధు, సిపిఓ సంజీవరావు, మున్సిపల్ కమీషనర్ సుజాతతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇండ్ల కేటాయింపు పట్ల హర్షం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో లబ్దిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయింపు పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో గతంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించినప్పుడు లబ్దిదారులను ఎంపిక చేశారు కానీ ఇండ్ల కేటాయింపు చేయలేదు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఎంపిక చేసిన లబ్దిదారులకు ఇండ్లు కేటాయించాలని సూచించడంతో మంగళవారం కలెక్టరేట్‌లో ఎంపిక చేసిన లబ్దిదారులకు అదనపు కలెక్టర్ సమక్షంలో ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ ద్వారా డబుల్‌బెడ్ రూం ఇంటి నెంబర్లను కేటాయించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనబోయిన పాపయ్య, తూము సత్యనారాయణ, నరేష్, చింతల రమేష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్ సాగుకు ప్రభుత్వం చేయూత




**ప్రజాపక్షం/వైరాః** వైరా రైతువేదిక నందు రైతు నేస్తం, ఆయిల్‌ఫామ్ సాగ యాజమాన్యం, వరి ధాన్యం కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ఎంవి.మధుసూదన్ ముఖ్య అతిధిగా పాల్గొనడం జరిగింది. రైతులు పామాయిల్ సాగు విస్తరించాలని ప్రభుత్వం పామాయిల్ సాగును ప్రోత్సహిస్తుందని రైతులు పామాయిల్ సాగు విస్తరించాలని చెప్పడం జరిగింది. నికర ఖచ్చితమైన ఆదాయాన్ని ఇచ్చేది పామాయిల్ పంట, ఎటువంటి కూలిలు అవసరం లేకుండా పామాయిల్‌ను సాగు చేసుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైరా మండల తహశీల్దార్ కె.శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, వైరా డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు టి.కరుణశ్రీ, మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్, ఏఈవోలు, సొసైటీ సీఈవోలు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ సిఐ వేధింపులు.. మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

**- నిరసన తెలిపిన బాధిత కానిస్టేబుల్‌తో సహా కుటుంబీకులు**
**- సంఘీభావం ప్రకటించిన తోటి సిబ్బంది, విధుల బహిష్కరణ**
**- మద్దతు తెలిపిన కుల సంఘాలు**
**- నివేదిక ఆధారంగా చర్యలు : సూపరింటెండెంట్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఎక్సైజ్ శాఖ సిఐ జయశ్రీ వేధింపులు తాళలేక అదే శాఖలో పనిచేస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ అఖిల ఆత్మహత్యా యత్నం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. ఈ మేరకు మంగళవారం బాధిత కానిస్టేబుల్ అఖిల కుటుంబీకులు ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపడంతో విషయం వెలుగులోనికి వచ్చింది. వివరాల ప్రకారం, ఎక్సైజ్ సిఐ జయశ్రీ సిబ్బందితో దురుసుగా ప్రవరిస్తూ ఇష్టాను సారంగా వ్యవహరిస్తారని, ఏదైనా అడిగినా, చెబుదామన్న కసురుకుంటూ చిన్నచూపు చూస్తుంటుందని తెలుస్తోంది. ఇదేక్రమంలో మంగళవారం అఖిల అనే కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవరిస్తూ కించపరిచినట్లు మాట్లాడింది. దీంతో మనస్తాపానికి గురైన అఖిల శనివారం విధులు ముగించుకున్న అనంతరం మాత్రలు మింగి ఇంటికి చేరుకుంది. ఈ క్రమంలో ఆమె ఇంటి వద్ద కళ్లు తిరిగి పడపోవడంతో కుటుంబీకులు హుటాహుటిన ఆమెను ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించగా మాత్రలు మింగినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ క్రమంలో అఖిల ఆరోగ్య పరిస్థితి కాస్త కుదుట పడిన అనంతరం మంగళవారం కుటుంబీకులు అఖిలను వెంటబెట్టుకుని ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. దీంతో అక్కడే ఉన్న సిబ్బంది కూడా నిరసనలో పాల్గొని సిఐ పనితీరు, వ్యవహార శైలిపై మండి పడి విధులు బహిష్కరించారు. ఆమె తీరు అందరితోనూ ఇలానే ఉంటుందని, క్రింది స్థాయి సిబ్బందిని చాలా చులకన భావంతో చూస్తుందని సిబ్బంది చెప్పడం గమనార్హం.ం అఖిల, ఆమె కుటుంబ సభ్యులు, సిబ్బంది చేస్తున్న నిరసనకు కుల సంఘాలు సైతం మద్దతు ప్రకటించారు. సిబ్బంది విధులు బహిష్కరించడంతో రంగంలోనికి దిగిన ఉద్యోగ సంఘాలు చర్చలు జరుపుతున్నాయి. జరిగిన ఘటనపై ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్యను వివరణ కోరగా, దీనిపై విచారణ చేపట్టి నివేదిక తెప్పిస్తామని, ఆ నివేదికను కమీషనర్‌కు పంపిస్తామని చెప్పారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని నాయకన్‌గూడెం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు సెంటర్‌ను కూసుమంచి తహసీల్దార్ రవి కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా తహసీల్ధార్ మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు ప్రభుత్వం బోనస్ అందిస్తుందని తెలిపారు. ఎంపీడీవో, ఎంపీఓ, అగ్రికల్చర్ ఏఓ, ఐకెపి ఏపిఎం శ్రీనివాసరావు, సీసీ, శ్రీ వెంకటేశ్వర గ్రామ సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, వివోఏ, రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతి రావు సూచించారు. మండలం లోని కొత్తకొత్తూరు ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం విద్య తో పాటు, క్రీడలను ప్రోత్సాహిస్తుందని అన్నారు. క్రీడల వలన విద్యార్థుల మధ్య స్నేహాభావం పెంపోందించుకోవచ్చునని పేర్కొన్నారు. దేహదారుడ్యం కు ఎంతోగానే దోహద పడుతాయని అన్నారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజమని అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహం తో క్రీడలలో ప్రతిభ ను చూపాలని అన్నారు. క్రీడలనిర్వహాణ కోసం శ్రమించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఏఎస్సై కోటేశ్వరరావు, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్ మిక్కిలి జోసెఫ్, ప్రగతి, మరియప్రసాద్, ఉపాధ్యాయులు ఎస్ నాగార్జున, ఎన్ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.


# రేగళ్ల రేంజ్ అటవీ పరిధిలో అసిస్టెంట్ కలెక్టర్ సౌరబ్ శర్మ ఆకస్మిక పర్యటన





**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల పరిధిలోని రేగళ్ల రేంజ్ అటవీ పరిధిలో అసిస్టెంట్ కలెక్టర్(ట్రైనీ ఐఏఎస్)సౌరబ్ శర్మ మంగళవారం దట్టమైన అటవీ ప్రాంతంలో రేగళ్ల రేంజర్ జస్వంత్ ప్రసాద్, ఫారెస్ట్ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా ఆయన విస్తృతంగా ట్రెక్కింగ్ చేసి స్థానిక జీవవైవిధ్యం, సంరక్షణ చర్యలు సున్నితమైన పర్యావరణ వ్యవస్థల నిర్వహణను అధ్యయనం చేసి అటాచ్మెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి అక్రమణ నివారణ వ్యూహాలు అటవీ సరిహద్దులను రక్షించడం కార్యకలాపాలను అరికట్టి పచ్చదనం మొక్కలు పెంపకాన్ని పరిశీలించి, నాటిన మొక్కల నిల్వ శాతాన్ని అంచనా వేశారు. వన్యప్రాణి నిర్వహణపై వన్యప్రాణి ఘర్షణ నివారణ నివాస ప్రాంతాల సంరక్షణ చర్యలపై ఫారెస్ట్ సిబ్బందితో చర్చించారు. గ్రామీణ పరిపాలనలో సమగ్ర దృష్టి కోణాన్ని ప్రతిబింబించే విధంగా అసిస్టెంట్ కలెక్టర్ మర్కోడు గ్రామంలో కీలక మౌలిక సదుపాయాలపై విస్తృత పరిశీలనలు నిర్వహించారు. తదనంతరం మొదటగా స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి సప్లిమెంటరీ గర్భిణీ స్త్రీల పోషకాహారం, ప్రాథమిక బాల్య విద్య నాణ్యతను అంచనా వేశారు. మర్కోడు ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబులాల్‌తో మాట్లాడుతూ పాఠశాలలోని మౌలిక సదుపాయాలు విద్యార్థులకు అందుబాటులో ఉండేలా వసతులు కల్పించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజర్ రెగ్యులర్‌గా 100శాతం ఉండేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అగ్గి రామకృష్ణ, ఉపాధ్యాయులు చందరావు, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/ మధిర :** ఎదురెదురుగా లారీ, బైకు ఢీకొన్న ప్రమాదంలో రిటైర్డ్ ఆర్టిసి కండక్టర్‌కు తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధిర ఫ్లైవర్ బ్రిడ్జి వద్ద బైకుపై వెళ్తున్న రిటైర్డ్ ఆర్టిసి కండక్టర్ నంబూరు రామారావును ఎదురుగా వస్తున్న లారీ ప్రమాదవశాత్తు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై ప్రయాణిస్తున్న రామారావు రెండు కాళ్లు విరిగిపోయి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టిన వ్యక్తులపై చట్టపరమైన కేసులు

**ప్రజాపక్షం/మణుగూరుః** గత మూడు రోజుల క్రితం మణుగూరులో పార్టీ ఆఫీసు విషయమై రెండు పార్టీల మధ్య జరిగిన గొడవ విషయమై మణుగూరు ఎస్‌డిపిఓ వి. రవీందర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొంత మంది వ్యక్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో వివిధ రకాలుగా రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూన్నారని అన్నారు. అందువల్ల ఇక నుండి ఈ విషయమై ఎవరైనా సోషల్ మీడియాలో వీడియోల రూపంలో గానీ, పోస్టుల రూపంలో గానీ రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టిన వారిపై చట్ట పరమైన కేసులు నమోదు చేయబడతాయని వారిని హెచ్చరించారు.

# అమరుల ఆశయసాదనకై పోరాడుదాం

**ప్రజాపక్షం/గుండాల :** దోపిడిడి పాలనను వ్యతికేస్తూ అమరులైన వీరుల ఆశయ సాదనకై పోరాడాలని మాజి ఎంపిపి ముక్తి సత్యం , కోరం సీతారాములు పిలుపునిచ్చారు. నవంబర్ 1నుండి 9వరకు న్యూడెమోక్రసి రాష్ట్రకమిటి పిలుపులో బాగంగా మండలంలోని రోల్లగడ్డ గ్రామానికి చెందిన ప్రతిఘటన పోరాటయోదుడు అమరుడు లింగన్న స్తూపం పార్టి జెండాను ఆవిష్కరించి ఆయనకు నివాళ్ళు అర్పిపించారు. కార్యక్రమంలో వై వెంకన్న , అరెం నరేష్, లాలయ్య, లాలు, రమేష్, వెంకన్న, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.